సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



'పది'నిసలు మొదలు

ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ఒక వైపు ప్రత్యేక చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు విద్యాభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది.

- 8లో▸



లోకహితులే పురోహితులు

లోక హితాన్ని కోరే వారే పురోహితులని హైదరాబాద్‌కు చెందిన ఉభయ తెలుగు రాష్ట్రాల శృంగేరి పీఠ సంచాలకుడు పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ అన్నారు.

- 8లో▸

3.28 లక్షల క్యూసెక్కుల మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 3,28,547 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.30 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు సంబంధించి 11,200 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

అనపర్తిలో భారీ వర్షం

కొవ్వూరు: జిల్లాలో శుక్రవారం కూడా కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి 24 గంటల వరకూ సరాసరి 17.5 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అనపర్తిలో గరిష్టంగా 82.4 మి.మీటర్లు వర్షం కురిసింది.బిక్కవోలులో 68.6 మి.మీటర్లు,రాజానగరంలో 38.6, రంగంపేటలో 26.4,గోకవరంలో 14.2,కొవ్వూరులో 22.2, నిడదవోలులో 38.2, ఉండ్రాజవరంలో 24.6,పెరవలిలో 3.8,దేవరపల్లిలో 2.2,కడియంలో 3.2,రాజమహేంద్రవరం రూరల్ లో 4.2, రాజమహేంద్రవరం అర్బన్‌లో 2.2, కోరుకొండలో 1.0 మి.మీటర్లు చొప్పున వర్షం కురిసింది.

నృసింహస్వామికి 'లక్ష్మీ'కటాక్షం

హుండీల ద్వారా రూ.28,67,788 ఆదాయం



హుండీల లెక్కింపులో అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది నృసింహస్వామిని సిరుల తల్లి 'లక్ష్మీ'దేవి కటాక్షించింది. హుండీల ద్వారా స్వామివారికి రూ.28,67,788 ఆదాయం చేకూరింది. గడచిన 88 రోజులకు గాను ఆలయ ప్రాంగణంలోని వివిధ హుండాలను శుక్రవారం తెరచి, ఆదాయాన్ని లెక్కించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్‌డీవీ ప్రసాద్, తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, దేవదాయ శాఖ ఈఓ బొక్కా వీర వేంకటేశ్వరరావు సమక్షంలో ఈ లెక్కింపు నిర్వహించారు. మెయిన్ హుండీ, గుర్రాలక్క అమ్మవారి హుండీల ద్వారా రూ.27,98,394, అన్నదానం హుండీ ద్వారా రూ.69,394 చొప్పున ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. దీంతో పాటు నీలకంఠేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.9,836 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బైర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గణపతికి రజత కవచం



గణపతికి రజత కవచం సమర్పిస్తున్న దాతలు

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో గణపతికి మాచిరాజు వెంకట సత్య సర్వేశ్వర సాయిరామ్ దంపతులు, అల్లుడు కొమ్మువరపు మోహనకృష్ణ, ఫణిరాజు (హైదరాబాద్) సుమారు రూ.2 లక్షల విలువైన వెండి తొడుగు సమర్పించారు. దీనిని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలకు శుక్రవారం అందజేశారు. వెండి తొడుగుకు అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యాన సంప్రోక్షణ, గణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రజత కవచాన్ని అర్చకుడు ఉండి దత్తుకు అందజేసి, ఉన్న గణేశునికి అలంకరించారు. అనంతరం అన్నదాన ట్రస్టుకు దాతలు రూ.లక్ష సమర్పించారు. వారికి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం ఇచ్చి సత్కరించారు.

ఆన్‌లైన్‌లో మెరిట్ జాబితా

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో నేషనల్ టీబీ ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది జూలై 31న విడుదల చేసిన వివిధ కేడర్ల ఉద్యోగ పార్ట్ నోటిఫికేషన్‌కు సంబంధించి అధికారులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రావిజినల్ మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచినట్టు తెలిపారు. జాబితాలో పేర్లను పరిశీలించుకునేందుకు ''హెచ్‌టిటిపిఎస్://ఈస్ట్‌గోదావరి.ఎపి.జిఒవి.ఇన్'' వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే వచ్చేనెల 4వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తమ వినతులు సమర్పించాలని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ కోరారు.

కారును ఢీ కొన్న బైక్

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై రాజానగరం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తులు ముందు వెళ్తున్న కారును తప్పించే క్రమంలో ఈ ప్రమాదానికి గురయ్యారు. వారివురూ ఎక్కడి వారు, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారు వంటి పూర్తి వివరాలు తెలియవలసి ఉంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి పూర్తి వివరాలు రావలసి ఉన్నాయని, అప్పటి వరకూ ఏమీ చెప్పలేమని రాజానగరం పోలీసులు వివరణ ఇచ్చారు.

ఇంటింటా ఆరోగ్యభాగ్యం

- జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ శిబిరాల నిర్వహణకు సర్వం సన్నద్ధం
- 45రోజులపాటు 383 శిబిరాలు
- 15రోజులు ముందుగానే సర్వే చేసిన సిబ్బంది
- ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం



రాజమహేంద్రవరం శాటిలైట్‌సిటిలో బీపీపరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ



దుళ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే బీపీ పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

రాజమహేంద్రవరం రూరల్: వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులను తీసుకువస్తోంది. అందరికీ సంపూర్ణ ఆరోగ్యభాగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రజారోగ్యానికి పట్టం కడుతూ పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇప్పటికే ఈ శాఖలో వైద్య ఆరోగ్య రంగంలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేసింది. నాడు- నేడు కింద పీహెచ్‌సీ భవనాలను రూపుదిద్దింది. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తూ పల్లెల చెంతకు ఆరోగ్య సేవలను తీసుకువెళ్తోంది. అవసరమైన ఆరోగ్యపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తోంది. మందులనూ అందజేస్తోంది.

తాజాగా ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. జగనన్న ఆరోగ్య సురక్ష కింద శనివారం నుంచి వైద్య శిబిరాలను నిర్వహించనుంది. 45 రోజులపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఆరోగ్యశిబిరాలు జరుగుతాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇప్పటికే గ్రామాల్లో ఇంటింటికీ వైద్య సేవలు అందిస్తున్న సర్కారు ఇప్పుడు ప్రత్యేక వైద్యశిబిరాల ద్వారా సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఆరోగ్య సురక్ష ద్వారా ఇప్పటికే ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టింది. అనారోగ్య బాధితులను గుర్తించింది. అనంతరం వైద్యశిబిరాల నిర్వహణకు శ్రీకారం చుడుతోంది. శనివారం నుంచి నవంబరు 15వ తేదీ వరకు వైద్యశిబిరాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేసింది. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా అధునాతన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టింది. ఆరోగ్య సురక్ష అమలు కోసం జిల్లా నోడల్ ఆఫీసర్‌ను కలెక్టర్ నియమించారు.

ముమ్మరంగా సర్వే

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, వలంటీర్లు కొద్దిరోజులుగా క్షేత్రస్థాయిలో ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీస్తున్నారు. బీపీ,షుగర్,హిమోగ్లోబిన్,యూరిన్,కఫం వంటి ఏడురకాల పరీక్షలు నిర్వహించి కేస్‌షీట్స్ సిద్ధం చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. అనంతరం వారికి కూపన్లు అందజేస్తున్నారు. ఆ కూపన్లతో బాధితులు తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వైద్యశిబిరాలకు వెళ్లి వైద్యసేవలు పొందవచ్చు. శిబిరాలలో వారికి వైద్యపరీక్షలు, సేవలు అందుతాయి. 162 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. అత్యాధునిక చికిత్స అవసరమైతే వైద్యులు సమీపంలోని ఆస్పత్రికి తరలించి ఉచితంగా వైద్యం అందిస్తారు. శస్త్రచికిత్సలు అవసరమైనా ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తారు. రోగులు కోలుకునే వరకూ పర్యవేక్షించేలా ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో అనుసంధానం చేస్తారు.



383 ప్రాంతాల్లో వైద్యశిబిరాలు

జిల్లాలో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు -1 వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇది విజయవంతం కావడంతో కలెక్టర్‌మాధవీలత సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ శిబిరంలో451 మంది సేవలు పొందారు. జిల్లాలోని 368 విలేజ్‌హెల్త్ క్లినిక్స్, 15 అర్బన్ హెల్త్ క్లినిక్స్ పరిధిలో 383 వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి వైద్యశిబిరంలోనూ జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలిజిస్టుతో పాటు ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో ఉంటారు. ఈసీజీ, రక్తపరీక్షలు సైతం చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తాం. అవసరమనుకుంటే రోగిని పెద్ద ఆస్పత్రులకు పంపి నాణ్యమైన చికిత్స అందిస్తాం. ఆరోగ్యశ్రీ ఆస్పత్రులలో చేర్పించి శస్త్రచికిత్సలూ చేయిస్తాం. శనివారం నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డా.కె.మాధవీలత, కలెక్టర్,తూర్పుగోదావరి.

సర్వం సిద్ధం



జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లు శనివారం నుంచి జిల్లాలో 15విహెచ్‌సీలలో, ఒక యుహెచ్‌సీలో పరిధిలో నిర్వహిస్తున్నాం. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఈశిబిరాలలో స్పెషలిస్టు వైద్యులతో పాటు ఇద్దరు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు పాల్గొని సేవలందిస్తారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు డెంటిస్ట్,ఆప్తమాలజిస్టులను సైతం అందుబాటులో ఉంచుతున్నాం.

– డా.కె.వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ

పేదలకు వరం



జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ శిబిరం పేద,మధ్యతరగతి ప్రజలకు ఒక వరం. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజల రోగ్యం విషయంలో చాలా మంచి మార్పులు తీసుకు వస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో పల్లెలో ఇంటికే వైద్యసేవలను తీసుకువచ్చారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఏడు రకాల పరీక్షలు చేస్తున్నారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

– అప్పారి జయప్రకాష్, విశ్రాంత ప్రిన్సిపాల్,డైట్,బొమ్మూరు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం



రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమించారు. ఈమేకరు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. రాజమహేంద్రవరం నగరం-1అధ్యక్షుడిగా పెంకే సురేష్, క్లస్టర్-2 అధ్యక్షుడిగా అర్జరపు వాసు, క్లస్టర్ -3 అధ్యక్షుడిగా మజ్జి అప్పారావు, క్లస్టర్-4అధ్యక్షురాలిగా పోలు విజయలక్ష్మి నియమితులయ్యారు. మండలాల వారీగా అయినీడి పల్లారావు(నిడదవోలు),భాస్కర్ రామయ్య(ఉండ్రాజవరం),వీరమల్లు సత్యనారాయణ(పెరవళి),ముంగండి కృపానందం(నిడదవోలు మున్సిపాలిటీ),రుత్తల ఉదయ భాస్కరరావు(కొవ్వూరు మున్సిపాలిటీ),సీహెచ్.మహేశ్వరరావు(చాగల్లు),సుందర సత్యనారాయణ(కొవ్వూరు),కాకర్ల వెంకటేశ్వరరావు(తాళ్లపూడి)సత్తి రామకృష్ణారెడ్డి(అనపర్తి),పోతుల ప్రసాదరెడ్డి(బిక్క వోలు)గుత్తుల వెంకట రమణ(పెదపూడి),నల్లా శ్రీనివాసరావు(రంగంపేట),అడపా కనకరాజు(కోరుకొండ),దూలం పెద్ద(రాజానగరం),గంటా శ్రీనివాసరావు(సీతానగరం)వై. సతీష్ చంద్ర(కడియం),ఉప్పులూరి సత్యనారాయణ(రాజమహేంద్రవరం రూరల్)మింది నాగేంద్ర (కార్పొరేషన్ వార్డులు),కూచుపూడి వీరవెంకట సత్యనారాయణ(దేవరపల్లి),పి.శ్రీనివాసరావు(ద్వారకాతిరుమల),పోతిరెడ్డి నాగరాజు(గోపాలపురం),జి.శ్రీనివాస్(నల్లజర్ల) నియమితులయ్యారు.

సర్వే నుంచి చికిత్స వరకూ అప్రమత్తం

అధికారులను ఆదేశించిన కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య సేవలు అవసరమైన వారిని గుర్తించే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం తాడేపల్లి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంలో సమగ్ర సర్వే అనంతరం పరీక్షలు, రోగ నిర్ధారణ, చికిత్స, మందుల పంపిణీ, ఆరోగ్యశ్రీ పథకం కింద తదుపరి సేవలు తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏఎన్ఎం, ఆశా, సీహెచ్‌ఓలు ఇందులో కీలక బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. ఆరోగ్యశ్రీ మిత్రల సమాచారం ప్రజలకు తెలియజేయాలన్నారు. వైద్య శిబిరాల వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. సర్వే నుంచి చికిత్స వరకు ముఖ్యమంత్రి కార్యాచరణపై దిశా నిర్దేశనం చేశారన్నారు. ఆరోగ్య డేటా నమోదు, టోకేన్ల జారీ, తదుపరి వైద్య శిబిరం ఏర్పాటు వివరాలు తెలియజేయాలన్నారు. 4వ దశలో టోకెన్ జారీ చేసిన వారికి, నేరుగా వైద్య శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి సేవలు అందించాలని స్పష్టం చేశారు. 5వ దశలో భాగంగా తదుపరి వైద్య సేవలకు రిఫరల్ ఆసుపత్రికి సిఫార్సు చేసి ఆరోగ్య మిత్రకు అనుసంధానం చేయాలన్నారు.

నేడు 16 ప్రాంతాల్లో శిబిరాలు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

జగనన్న ఆరోగ్య సురక్ష కింద జిల్లాలో శనివారం 16 చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని అద్దేపల్లి కాలనీ సచివాలయం ప్రాంతంలోని వైద్య శిబిరాన్ని శనివారం తాను సందర్శిస్తానన్నారు. అనపర్తి మండలం కుతుకులూరు-2, బిక్కవోలు పరిధిలోని పూలపల్లి-1, చాగల్లు -2, దేవరపల్లి మండలం చిన్నాయగూడెం-1, గోపాలపురం మండలం చిట్యాల-1, కడియం మండలం దుళ్ల-1,కోరుకొండ మండలం వెస్ట్ గోనగూడెం, కొవ్వూరు మండలం వాడపల్లి-1, నల్లజర్ల మండలం పుల్లలపాడు, నిడదవోలు మండలం విజ్జేశ్వరం, పెరవలి మండలం కానూరు -1, రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని అద్దేపల్లి కాలనీ సచివాలయం ప్రాంతం, రాజానగరం మండలం కానవరం, రంగంపేట-2, సీతానగరం మండలం చిన్నకొండేపూడి-2, ఉండ్రాజవరం-1లలో శనివారం వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి

- వైఎస్సార్ వాహన మిత్ర లబ్ధిదారులకు ఆర్థిక సాయం
- 11,819 మంది ఖాతాల్లో రూ.11.82 కోట్లు జమ
- నమూనా చెక్కు అందజేసిన ఎంపీ, కలెక్టర్



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్,కలెక్టర్ మాధవీలత,జేసీ తేజ్ భరత్, వైఎస్సార్‌సీపీ సిటీ కో-ఆర్డినేటర్ డా గూడూరి శ్రీనివాస్, మేడపాటి షర్మిలా రెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ప్రతీ రంగంలో పనిచేసే వారి సమస్యలను తెలుసుకుని అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్,జిల్లా కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వైఎస్సార్ వాహన మిత్ర 5వ విడత సాయం జమ చేసే కార్యక్రమంలో వీరు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత విజయవాడ విద్యానగర్ నుంచి రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో వాహన మిత్ర బ్యాంకు ఖాతాలకు సీఎం జగన్ మోహన్ రెడ్డి డీబీటీ ద్వారా నగదు జమచేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా వాహనం కలిగి స్వయం ఉపాధి పొందుతున్న ఆటో, ట్యాక్సీ, మ్యాక్స్ క్యాబ్ డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లకు, ఇన్సూరెన్స్, ఫిట్ నెస్ సర్టిఫికెట్స్ తదితర అవసరాలకు అండగా ఏటా రూ.10 వేల వంతున ప్రభుత్వం ఆర్థిక సాయంగా అందిస్తోందన్నారు. వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా నేడు అందించిన రూ.275.93 కోట్లతో కలిపి ఇప్పటివరకు రూ. 1,301.89 కోట్లు ఖాతాల్లో జమ చేసిందన్నారు. ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఈ 50 నెలల్లో రూ.50 వేల చొప్పున డ్రైవర్ల ఖాతాలకు ఆర్థిక సాయం జమ చేశారన్నారు.

ఏటా రూ.10వేలు సాయం

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఆటో, టాక్సీ, క్యాబ్, వాహన యాజమానులు,డ్రైవర్లు వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి అన్ని రంగాల వారి కష్టాలు తెలుసుకుని ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. ఏటారూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించడం ద్వారా వాహన నిర్వహణ, బీమా ప్రీమియం, బ్రేక్ ఖర్చులు కోసం ఎవరిమీదా ఆధారపడకుండా చూస్తున్నారన్నారు. తాజాగా జిల్లా వ్యాప్తంగా 11,819 మంది ఆటో, క్యాబ్, ఓనర్లు, డ్రైవర్ల ఖాతాలో రూ.11.82 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. అర్హత ఉండి విద్యుత్ బిల్లులు, ఆస్తుల అసెస్మెంట్, ఆధార్ సీడింగ్ సంబంధించి పొరపాటు దొర్లితే సరిచేసి సంక్షేమ పథకాలను వర్తింప చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ సిటీ కో-ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, పలువురు ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి చదువుల తల్లికి పెద్ద కష్టం



కోమాలోకి జారుకున్న కొలూరి సుజిత

వైద్యానికి సాయం చేయాలని తల్లి వేడుకోలు

తాళ్లపూడి: పేదింటి చదువుల సరస్వతికి పెద్ద కష్టం వచ్చింది. చిన్న వయస్సులోనే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆ విద్యార్థిని ప్రస్తుతం కోమాలో ఉంది. తన కుమార్తె వైద్యానికి దాతలు సాయం చేసి ఆదుకోవాలని ఆమె తల్లి అర్థిస్తోంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అన్నదేవరపేటకు చెందిన కొలూరి సుజిత అక్కడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవలే టెన్త్ చదివి స్కూల్ టాపర్‌గా నిలిచింది. తండ్రి లేని సుజిత ప్రస్తుతం గోపాలపురం గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. తల్లి హెప్సిబా కూలి పనులు చేసుకుంటూ కుమార్తెను చదివిస్తోంది. అయితే ఇటీవల సుజితకు తలలో సమస్య తలెత్తింది. గురుకుల పాఠశాల యాజమాన్యం ఆమెను గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లింది. ఆమె పరిస్థితి సీరియస్ అని తేలింది. దాంతో సుజితను రాజమహేంద్రంలోని హరిత న్యూరో ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె ప్రస్తుతం కోమాలోకి వెళ్లిందని వైద్యులు తెలిపారు. పేదరాలైన సుజిత తల్లి హెప్సిబా వైద్యానికి దాతల సాయాన్ని అర్థిస్తోంది. ఆర్థిక సాయం చేసే దాతలు 86397 27257 అనే ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శుక్రవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. పౌర్ణమిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తెల్లవారుజాము నుంచి స్వామివారి ఆలయానికి తరలి వచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని వ్రతాలు రెండు వేలు జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో నాలుగు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. సత్యగిరిపై సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాలలో శుక్రవారం సత్యదేవుని వ్రతం నిర్వహించారు. ప్రతీ పౌర్ణమికు పాఠశాల విద్యార్థులతో స్వామివారి వ్రతం ఆచరింపజేస్తున్నట్టు పాఠశాల హెచ్‌ఎం ఆరాధ్యుల లక్ష్మీనరసింహం తెలిపారు.



సత్యదేవుని వ్రతమాచరిస్తున్న స్మార్త, ఆగమ పాఠశాల విద్యార్థులు

రూ.లక్ష దాటిన కట్న కానుకలు

అన్నవరం: సత్యదేవుని నిత్య కల్యాణంలో భక్తులు స్వామి, అమ్మవారికి సమర్పిస్తున్న కట్న కానుకలు రూ.లక్షకు పైగా వచ్చాయి. భాద్రపద పౌర్ణమి, శుక్రవారం స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు రూ.7,700 కానుకలు సమర్పించగా, తొమ్మిది మంది భక్తులు స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించారు. గతంలో స్వామివారి నిత్యకల్యాణంలో భక్తులు కట్న కానుకలు సమర్పించే ఆచారం ఉండేది. కొద్ది కాలంగా దీనిని ఆచరించడం లేదు. దీంతో ఆగస్టు 13 నుంచి ఈ విధానాన్ని ఈఓ చంద్రశేఖర్ అజాద్ పునరుద్ధరించారు. ఇప్పటివరకు కట్నకానుకల రూపంలో దేవస్థానానికి రూ.లక్షా పది వేలు దేవస్థానానికి సమకూరింది. వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, అర్చకులు గంగాధరబట్ల శ్రీనివాస్, పురోహితులు పాలంకి పట్టాభి తదితరులు శుక్రవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం కట్న కానుకలు సమర్పించాలని కామేశ్వరశర్మ కోరారు. దీంతో భక్తులు కట్నకానుకలు సమర్పించారు. రూ.500 కన్నా తక్కువ నగదును హుండీలో వేశారు.

రూట్ క్లియర్

నిడదవోలు వయా ధవళేశ్వరం పల్లె వెలుగు బస్సులకు మార్గం సుగమం

ధవళేశ్వరం: తాడేపల్లిగూడెం, నిడదవోలు డిపోలకు చెందిన పల్లె వెలుగు బస్సులు ధవళేశ్వరం బ్యారేజీ మీదుగా వాడపల్లి, రాజమహేంద్రవరంకు వెళ్లేందుకు విజ్జేశ్వరం వద్ద అడ్డంగా ఉన్న గడ్డర్ ఎత్తు పెంచామని కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం రోడ్ కం రైల్ వంతెన మరమ్మతుల నేపథ్యంలో రాజమహేంద్రవరానికి వయా బ్యారేజీ మీదుగా ఆర్టీసీ బస్సులు తిరిగే అవకాశం లేనందున విజ్జేశ్వరం విద్యుత్ ప్లాంట్ సమీపంలో పల్లె వెలుగు బస్సులు వెళ్ళేందుకు అనువుగా గడ్డర్ ఎత్తు పెంచాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు.

పింఛన్లకు రూ.67.36 కోట్లు విడుదల

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో వైఎస్సార్ పింఛను కానుకగా ఆదివారం నుంచి 2,44,133 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.67.36 కోట్లు విడుదల చేసింది. పింఛన్లను వలంటీర్లు ఈ నెల ఐదవ తేదీ వరకు పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



శాన్విరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: టర్కీలో శనివారం నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకూ జరగనున్న ఇంటర్నేషనల్ ముయ్ థాయ్ బాక్సింగ్ పోటీలకు భారత్ నుంచి రావులపాలేనికి చెందిన కర్రి శాన్విరెడ్డి ఎంపికైంది. గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు శుక్రవారం ఈ విషయం తెలిపారు. ఈ సందర్భంగా శాన్విరెడ్డిని, ఆమె తల్లిదండ్రులు కర్రి శ్రీరామచంద్రారెడ్డి దంపతులను గోపాలపురంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు.

పెన్సిల్ బొమ్మలకు గ్లో వరల్డ్ రికార్డు



విద్యార్థిని హేమలతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు

తుని రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల బీఎస్సీ విద్యార్థిని సీహెచ్ హేమలత పెన్సిల్‌తో గీసిన బొమ్మలకు గాను గ్లో వరల్డ్ రికార్డు సాధించింది. ఆమెను కళాశాలలో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత, అధ్యాపకులు అభినందించారు. రుటెండో ఫౌండర్ జారీ చేసిన మెమెంటో, సర్టిఫికెట్ అందించారు. రసాయన శాస్త్రంలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న హేమలత తన కళా నైపుణ్యంతో మరిన్ని రికార్డులు, అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్, అధ్యాపకులు ఢిల్లేశ్వరరావు, బి.నాగరాజు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

బిక్కవోలు: కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్సై పి.బుజ్జిబాబు కథనం ప్రకారం.. తొస్సిపూడి కాలువలో బుధవారం రాత్రి గణపతి నిమజ్జనాలు జరిగాయి. అందులో పాల్గొన్న మండలంలోని కొమరిపాలెం గ్రామానికి చెందిన తేతలి నాగ వీర వెంకట రామారెడ్డి (20) అలియాస్ నవీన్ కాలువలో గల్లంతయ్యాడు. అతడి మృతదేహాన్ని శుక్రవారం ఉదయం చింతపల్లి లాకు సమీపాన కాలువలో గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి సీహెచ్‌సీ తరలించారు.

‘పది’నిసలు మొదలు

- టెన్త్‌లో మెరుగైన ఫలితాలకు ముందస్తు కార్యాచరణ
- ఈ ఏడాది జూలై నుంచే ప్రత్యేక తరగతులు



ప్రత్యేక తరగతుల్లో శిక్షణ పొందుతున్న పదో తరగతి విద్యార్థులు

రాయవరం: ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ఒక వైపు ప్రత్యేక చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు విద్యాభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది. 2023–24 విద్యా సంవత్సరం ఈ ఏడాది జూన్ 12న ప్రారంభమైంది. ఆ రోజునే ప్రభుత్వం జగనన్న విద్యా కానుక ద్వారా పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూ.. ఇలా విద్యార్థులకు అవసరమైన అన్నీ అందించింది. ఉపాధ్యాయుల బదిలీలు కూడా పూర్తి చేసిన ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాడిలో పెట్టింది. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. గత ఫలితాలను దృష్టిలో ఉంచుకున్న రాష్ట్ర విద్యా శాఖ అధికారులు ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపొందించారు. గతానికి భిన్నంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు జూలై నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు..

ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యా శాఖ ‘పది’ంతల కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే విద్యా శాఖ ఆధ్వర్యంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహించగా, అక్టోబర్ మూడో తేదీ నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్–2 పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత విద్యా సంవత్సరం పదో తరగతిలో 18,936 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 13,915 మంది ఉత్తీర్ణత సాధించగా, 5,021 మంది ఉత్తీర్ణులు కాలేకపోయారు. మొత్తం మీద 73.48 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 13వ స్థానంలోను, జోన్–2 పరిధిలోని ఏడు జిల్లాల్లో ద్వితీయ స్థానంలోను నిలిచింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో గత ఏడాదికి మించి రాష్ట్రంలో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో జిల్లా విద్యా శాఖ ముందుకు వెళుతోంది.

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ఏటా పరీక్షలకు ముందు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. సాధారణంగా సమ్మేటివ్–1 పరీక్షల అనంతరం నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూంటారు. ఈ విద్యా సంవత్సరంలో గతానికి భిన్నంగా ఈ ఏడాది జూలై నుంచే పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూండటం గమనార్హం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 224 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం బాలురు 10,039, బాలికలు 9,706 కలిపి మొత్తం 19,745 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. వీరందరికీ రోజూ ఉదయం నుంచి 8 నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు జరుపుతున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

ప్రతి రోజూ సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు జరుపుతూండగా.. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. బి–కేటగిరీ విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో బాగా చదువుతూ.. మరికొన్ని సబ్జెక్టుల్లో వెనుకబడి ఉంటారు. సి–కేటగిరీ విద్యార్థులు ఒకటి, రెండు సబ్జెక్టులు తప్ప మిగిలిన వాటిల్లో వెనుకబడుతూంటారు. అలాంటి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ముఖ్యంగా ఆయా పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు స్టడీ మెటీరియల్ సిద్ధం చేసుకుంటున్నారు.

మరింత మెరుగైన ఫలితాలకు..



ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూలై నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలను తు.చ. తప్పక పాటిస్తున్నాం. పదో తరగతి పరీక్షల్లో జిల్లాను మరింత మెరుగైన స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

ప్రణాళికాబద్ధంగా..



పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణతకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాం. ఫార్మేటివ్–1 పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థుల స్థాయిని అంచనా వేసుకుంటున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నాం. ప్రధానోపాధ్యాయులతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

రైల్వే తత్కాల్ యూజర్ దుర్వినియోగం

- టిక్కెట్లపై అదనపు వసూళ్లు
- నెట్ సెంటర్‌లో తనిఖీలు
- ఆర్‌పీఎఫ్ అదుపులో నిర్వాహకుడు

అమలాపురం టౌన్: రైల్వే తత్కాల్ యూజర్‌ను దుర్వినియోగం చేయడమే కాకుండా, ఆ టిక్కెట్లపై ప్రయాణికుల నుంచి అదనపు సొమ్ములు వసూలు చేస్తున్నారంటూ వస్తున్న ఫిర్యాదులపై రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) రాజమహేంద్రవరం అధికారులు స్పందించారు. అమలాపురంలోని ఓ ప్రైవేటు నెట్ సెంటర్‌లో శుక్రవారం తనిఖీలు చేశారు. అమలాపురంలో కొంత కాలం కిందటి వరకూ రైల్వే శాఖ ఆధ్వర్యంలో పని చేసిన రిజర్వేషన్ కౌంటర్ సమీపాన ఓ ప్రైవేట్ నెట్ సెంటర్ ఏర్పాటైంది. దాని నిర్వాహకుడు ఆ శాఖ నుంచి పరిమితమైన తత్కాల్ టిక్కెట్ల బట్వాడాకు అనుమతి పొందాడు. అనుమతి పొందిన దానికి మించి టిక్కెట్లు అమ్ముతూ రైల్వే యూజర్‌ను దుర్వినియోగం చేశాడన్నది అతడిపై అభియోగం. అలాగే ఆ టిక్కెట్లపై నిర్దేశిత కమీషన్ కంటే ఎక్కువ సొమ్ములు వసూలు చేస్తున్నాడని మరో ఆరోపణ వచ్చింది. ఈ రెండు ఫిర్యాదులపై ఆర్‌పీఎఫ్ అధికారులు ఆ నెట్ సెంటర్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. రాత్రి పొద్దుపోయే వరకూ ఈ తనిఖీలు కొనసాగాయి. నెట్ సెంటర్‌లోని కంప్యూటర్, ఇతర నెట్ సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు.

భర్తతో పోట్లాడి.. కాలువలో దూకింది

గల్లంతైన మహిళ



పోలవరం కాలువలో దూకిన కస్తూరి (ఫైల్)

నల్లజర్ల: భర్తతో పోట్లాడిన ఓ యువతి పోలవరం కాలువలో దూకింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరానికి చెందిన నెరుసు శ్రీనివాసరావుకు, కొవ్వూరుకు చెందిన కస్తూరితో ఈ ఏడాది జనవరిలో వివాహమైంది. శ్రీనివాసరావు వేలివెన్ను శశి విద్యాసంస్థల్లో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య ఇటీవల మనస్పర్థలు వచ్చి, తరచూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కస్తూరిని కొన్ని రోజుల పాటు కొవ్వూరులోని పుట్టింట్లో ఉంచమని శ్రీనివాసరావు తల్లిదండ్రులు సూచించారు. దీంతో ఆమెను శ్రీనివాసరావు బైక్‌పై తీసుకొని శుక్రవారం ఉదయం బయలుదేరాడు. అనంతపల్లి పోలవరం కుడి కాలువ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి కాలి చెప్పు పడిపోయిందని, బైక్ ఆపాలని కస్తూరి భర్తను కోరింది. బైక్ ఆపిన వెంటనే ఆమె పరుగెత్తి, అందరూ చూస్తుండగానే బ్రిడ్జిపై నుంచి కాలువలోకి దూకేసి, ప్రవాహంలో గల్లంతైంది. దీనిపై ఆమె భర్త శ్రీనివాసరావు నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేశామని ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. కస్తూరి ఆచూకీ కోసం కాలువలో గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు.

లోకహితులే పురోహితులు



పురోహితుల పాత్రను వివరిస్తున్న పండితులు

అమలాపురం టౌన్: లోక హితాన్ని కోరే వారే పురోహితులని హైదరాబాద్‌కు చెందిన ఉభయ తెలుగు రాష్ట్రాల శృంగేరి పీఠ సంచాలకుడు పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ అన్నారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ఆపస్తంభ పురోహిత పరిషత్ 23వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురోహిత వ్యవస్థ ప్రాధాన్యాన్ని వివరించారు. కర్మలు చేయించుకునే వారి ఆర్థిక పరిస్థితి సక్రమంగా ఉండేటట్లు పురోహితుడు దీవిస్తాడని అన్నారు.

అతడు ఉపనయనం చేయిస్తేనే వేదం అభ్యసించే అవకాశం ఉంటుందని చెప్పారు. అన్ని కుటుంబాల్లోకీ ధర్మాన్ని తీసుకుని వెళ్లే బాధ్యత పురోహితులదేనన్నారు. వేదం శాశ్వతమైనదని, స్మార్తం కూడా ఉంటేనే దాని ఫలితం ఉంటుందని వివరించారు. వేదం, స్మార్తం సూర్యచంద్రుల వంటివని విపులీకరించారు. సభకు అధ్యక్షత వహించిన వేద పండితుడు చిర్రావూరి శ్రీరామశర్మ మాట్లాడుతూ, పుట్టింది మొదలు మరణించే వరకూ మానవులు జరిపే 16 ఉపచారాలు పురోహితులు ఎందుకు చేయాలో అవగాహన కల్పించారు. పరిషత్ అధ్యక్షుడు కర్రా వెంకట సుబ్రహ్మణ్యశర్మ, కార్యదర్శి తోపెల్ల కార్తికేయశర్మ ఆధ్వర్యాన ఆపస్తంభ సదస్సు జరిగింది. ప్రత్యేక ఆహ్వానితులుగా పండితులు తోపెల్ల లక్ష్మీనరసింహమూర్తి, మాజెళ్ల వేంకట సత్య సుబ్రహ్మణ్యశర్మ, ఆకొండి రామకృష్ణశర్మ, ఖండవిల్లి జగన్నాథ విఠల్, భళ్లమూడి సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పురోహితులు అధిక సంఖ్యలో ఈ సభలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కనికిరెడ్డి తదితరులు



రాష్ట్ర సాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

రావులపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టుకు రావులపాలెం బాలుర హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.సుబ్బరాజు శుక్రవారం ఈ విషయం తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు మడేలి లోహిత్ శ్రీఅర్జున్ విఘ్నేష్, షేక్ నస్రీన్ భాను ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. క్రీడాకారులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చిర్ల కనికిరెడ్డి తదితరులు అభినందించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు..

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు లక్కింశెట్టి విజయసాయిలక్ష్మి, రోళ్ల లోహిక సంగీత కీర్తి ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయిని ఎ.సూర్య కనక దుర్గ, పీడీ అందె సూర్యనారాయణ ఈ విషయం తెలిపారు. హైస్కూలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థినులను సత్కరించారు. అనపర్తిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయన్నారు. వీటిలో విజయసాయిలక్ష్మి, లోహిక సంగీత కీర్తి ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థినులను ఎస్‌ఎంసీ చైర్మన్ మట్రి ఏడుకొండలు, సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ సభ్యులు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, పబ్బినీడి రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్ రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిలయిన వారికి కట్టుకునే అవకాశం. డిగ్రీ & పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, B.Li.Sc. నాగార్జున, ఆంధ్ర, వెంకటేశ్వర యూనివర్సిటీల ఎగ్జామ్స్ అన్నీ మా కాకతీయ విద్యాసంస్థలలో జరుగును. 100% పాస్. అడ్మిషన్లు జరుగుచున్నవి. కాకినాడ దగ్గరలో గల గొల్లపాలెం, రాజమండ్రి, అత్రేయపురం. ఫోన్ : 99494 82757, 98495 82043 [V-2148]

Real Estate

COMMERCIAL SALE

■ Commercial Property for Sale Land Building 1428 Sq.yds 24500 Builtup Area at Saidabad,Hyd. Rent getting 5 Lakhs. Ph: 9849090098 [HA-346]

FLAT FOR SALE

■ అమలాపురం వేంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ నందు ప్రీమియం లగ్జరీ 2BHK ఈస్ట్ ఫేసింగ్, 100% వాస్తు, 100ft మెయిన్ రోడ్, అప్రూవ్డ్, SBI అప్రూవ్డ్ ప్రాజెక్ట్, ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. Cont. ✆ : 95025 16916 F [R-1171007]

HOUSE FOR SALE

■ New Buildings House for sale East Facing, North East Corner near ADB Road, Sainagar SBI Colony, Vakalapudi, Kakinada-533 005 ✆ : 93945 33029, 99897 97824 [R-1199342]

PLOT FOR SALE

■ కోలమూరు, బూరుగుపూడి మరియు గాదరాడ గ్రామంలో రెడీగా ఇల్లు కట్టుకొనుటకు ఇళ్ళ స్థలములు అమ్మకమునకు కలవు. గజం రేటు 5,000/- నుండి ప్రారంభం. ఫోన్ : 94932 22215 P [V- 2163]

■ 22 సెంట్లు 5లక్షలకే (దసరా ఆఫర్) కస్టమర్స్‌కు మాత్రమే. ప్రకాశంజిల్లా, ముండ్లమూరు దగ్గరలో 4 సం. ఎర్రచందనం మొక్కలతో పూర్తి డెవలప్‌మెంట్స్, స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 95234 56789. P [B-1206657]

TO-LET

■ రాజమండ్రి, లాలాచెరువు సెంటర్ భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా ఇండివిడ్యువల్ హౌస్ గ్రౌండ్ ఫ్లోర్ 3 BHK+1 & ఫస్ట్‌ఫ్లోర్ 3 BHK+1 రెసిడెన్షియల్ / CUM ఆఫీస్ అద్దెకు ఇవ్వబడును. ✆ : 79896 43529, 99892 79737 [R-6162]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిర ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

Wanted

■ ఇజ్జానా హోం హెల్త్ సర్వీసెస్ (P) లిమిటెడ్ వారికి రాజమండ్రి, కాకినాడలలో టూ వీలర్, కలిగి, డిగ్రీ చదివిన స్త్రీ/పు ఫీల్డ్ స్టాఫ్ కావలెను. సెల్ : 73373 13323 [R-4664]

■ రాజమండ్రి, నామవరం, లాలాచెరువు ప్రాంతాల్లో ATM, షోరూమ్స్, స్టార్ హోటల్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. జీతం 12 to 15 వేలు. రూం + భో, వసతి. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. ✆ 93922 69369 [R-93]

■ శ్రీసిటి తడ (A.P) లో డైకిన్ A/C తయారీ కంపెనీ నందు పనిచేయుటకు డిప్లొమా (MECH, EEE, ECE, CIVIL) B.Tech, డిగ్రీ అభ్యర్థులు కావలెను. సంప్ర: 70936 66784 [P-772910]

■ Sales Man Job Openings in A Retail Store At Centro Main Road, Kakinada Walk in Interview 11am to 5pm. Ph: 8686683088, 9177701327 [H-193210]

■ శ్రీసాయిరాం హోమ్‌కేర్ Hyd లో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసు కొనుటకు స్త్రీ/పు.కావలెను. జీతం: 18000/- ఏజెంట్ కమీషన్ 7K. 9666001826, 9666001827 [H-793403]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 98485 71888/ 91609 00024 [HA-657]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్ గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-801116]

■ పనిమనిషి (మగ) కావలెను: హైదరాబాద్‌లో ఇంటిలో పనిచేయుటకు మగ పనిమనిషి కావలెను. ఉచితంగా వసతి కల్పించబడును. ఆకర్షణీయమైన జీతం. సెల్: 94400 35395 [B-1193591]

■ పర్మినెంట్ ఉద్యోగ అవకాశము. 10th, ఇంటర్ చదివిన 25 సం॥లోపు యువతి / యువకులు కావలెను. రూం ఫ్రీ, ట్రైనింగ్ తరువాత 15,000/- ఆపైన. ఫోన్ :83742 33499, 94942 66782 [V-5934]

■ వైజాగ్‌లో మా షాపింగ్ మాల్ Ware House నందు పనిచేయుటకు 19-35 వయస్సు గల యువకులు కావలెను. నెల జీతం : 10,000/- + ఫుడ్, రూమ్ సదుపాయం కలదు. ఫోన్ : 97046 37370, 97051 94330 [V-26454]

■ హైదరాబాద్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ J.Groupలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ మరియు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం: 15000 to 25000 (టీఏ+డీఏ+ఇన్సెంటివ్స్) Qul: 10th to Any Degree. ✆ 73961 85576, 80081 97227 [B-1193167]

■ రాజమండ్రి పరిసర ప్రాంతాలలో అమెజాన్ ప్రొడక్ట్స్ డెలివరీ చేయడానికి "పురుషులు" కావలెను. జీతం : 13000+2000 ఇన్సెంటివ్+పెట్రోల్ అర్హతలు : బైక్, ఆండ్రాయిడ్ ఫోన్ (T&C Apply) ✆ : 09491972983, 08179191481 [R-6202]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

5న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని రాక

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు వచ్చే నెల ఐదో తేదీన అమలాపురం రానున్నారు. ఆ రోజు ఉదయం కాకినాడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 10 గంటలకు అమలాపురం కాటన్ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి అమలాపురం పురపాలక సంఘం కౌన్సిల్ హాలులో వైఎస్సార్ ఇంటలెక్చువల్స్ ఫోరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.10 గంటలకు కాటన్ గెస్ట్ హౌస్‌కు చేరుకొని, రోడ్డు మార్గంలో కాకినాడ బయలుదేరుతారు.

పిడుగు పడి మత్స్యకారుడి మృతి

కాట్రేనికోన: మండలంలోని బ్రహ్మసమేధ్యం పంచాయతీ బలుసుతిప్పకు చెందిన మత్స్యకారుడు కర్రి నాగూరు (55) పిడుగు పడి మృతి చెందాడు. నాగూరు తన సహచరులతో కలిసి శుక్రవారం గోదావరి పాయలో చేపల వేటకు వెళ్లాడు. ఆ సమయంలో ఆకస్మికంగా ఈదురు గాలులు వీచి, ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడటంతో నాగూరు అక్కడికక్కడే మృతి చెందాడు. నాగూరుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు తదితరులు సంతాపం తెలిపారు.

చెల్లని చెక్కుకేసులో జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన మహిళకు ఐదు నెలల జైలు శిక్ష విధిస్తూ, రూ.4 లక్షల పరిహారం చెల్లించాలని పేర్కొంటూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్.ఉషాలక్ష్మీ కుమారి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన బొల్లు వెంకట కృష్ణారావు వద్ద ఇదే నగరానికి చెందిన కడియాల కనకలక్ష్మి రూ.4 లక్షల అప్పు తీసుకుంది. ఆ బాకీ తీర్చేందుకు 2018లో రూ.4 లక్షల చెక్కు ఇచ్చింది. ఆ చెక్కు బౌన్స్ అవడంతో వెంకట కృష్ణారావు కోర్టును ఆశ్రయించాడు. కనకలక్ష్మిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు. చిత్రంలో స్వాధీనం చేసుకున్న గంజాయి

కడియం: వేమగిరి వద్ద ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి 22 కిలోల గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కడియం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ముందుగా వచ్చిన సమాచారం మేరకు కడియం ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తన సిబ్బందితో వేమగిరి గ్రామ శివారున ఖాళీ స్థలంలో అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒడిశాకు చెందిన బిపాడ బంజన్ పాణిగ్రాహి, కడియపులంకకు చెందిన మంగ పట్టాభి, ఇసనాసి మణికంఠ, బుర్రిలంకకు చెందిన బెహరా చంద్రశేఖర్, పొట్టిలంకకు చెందిన నాగిరెడ్డి దుర్గాప్రసాద్, వంగా శివరాం, వీరవరానికి చెందిన కొత్తపల్లి అయ్యప్ప ఉన్నారు. వారి నుంచి గంజాయి, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రానికు చెందిన బంజన్ పాణిగ్రాహి వద్ద పట్టాభి, మణికంఠ, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, అయ్యప్ప, శివరాం గంజాయి కొనుక్కుని తాగడంతో పాటు, చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి కడియం పరిసర ప్రాంతాల్లో రూ.500 చొప్పున విక్రయిస్తున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలిస్తామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. గంజాయి అక్రమంగా తరలిస్తున్న, తాగుతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అరెస్టు చేసిన వారి నుంచి సేకరించిన సమాచారం మేరకు గంజాయి తాగే, అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ తిలక్, సిబ్బందిని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు.

ఏసీబీ వలలో దూబచర్ల వీఆర్‌ఓ



లంచంతో పట్టుబడిన వీఆర్‌ఓ సూరిబాబు

నల్లజర్ల: లంచానికి కక్కుర్తి పడిన ఓ వీఆర్‌ఓ ఏసీబీ వలలో చిక్కారు. నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామ సచివాలయంలో ఏసీబీ రాజమహేంద్రవరం అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య ఈ వివరాలు వెల్లడించారు. ఆమె కథనం ప్రకారం.. అయ్యవరం గ్రామానికి చెందిన రైతు అల్లే రాంబాబుకు తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన 1.12 సెంట్ల భూమి వచ్చింది. దీనిని ఆన్‌లైన్ చేసి, పట్టాదారు పాస్ పుస్తకానికి దూబచర్ల గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. దీని కోసం దూబచర్ల వీఆర్‌ఓ సూరిబాబు రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో రైతు రాంబాబు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ముందుగా రూ.10 వేలు ఇచ్చాడు. మిగతా రూ.20 వేలలో శుక్రవారం రూ.15 వేలు ఇస్తుండగా ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం ఏసీబీ అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, ఇన్‌స్పెక్టర్లు వాసు కృష్ణ, శ్రీనివాసరావు, ఎస్సై విల్సన్, సిబ్బంది ఒక్కసారిగా దాడి చేశారు. వీఆర్‌ఓ సూరిబాబును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి, ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని సౌజన్య చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే 14400కు కాల్ చేసి లేదా రాజమహేంద్రవరంలోని ఏసీబీ కార్యాలయానికి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

పార్శిల్ కార్యాలయాల్లో విజిలెన్స్ తనిఖీలు

సరైన ఆధారాలు లేని రూ.5.50 లక్షల సరకుల నిలుపుదల

అమలాపురం టౌన్: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అమలాపురంలోని పలు పార్శిల్ కార్యాలయాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కలిసి రెండు బృందాలుగా ఈ తనిఖీలు చేపట్టారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో రెండు పార్శిల్ కార్యాలయాల్లో రూ.5.50 లక్షల విలువైన సరకులను నిలిపివేశారు. తొలుత స్థానిక పట్టాభిరామ లారీ సర్వీస్‌ను తనిఖీ చేశారు. విజయవాడ నుంచి అమలాపురానికి వచ్చిన ఐదు పార్శిళ్లకు సంబంధించి సరైన పత్రాలు, బిల్లులు లేవని గుర్తించారు. దీంతో రూ.86,583 విలువైన సరకులను నిలుపు చేశారు. తర్వాత ఆర్టీసీ బస్ స్టేషన్‌లోని పార్శిల్ ఆఫీసును తనిఖీ చేశారు. అక్కడ ఆరు పార్శిళ్లకు సంబంధించి సరైన పత్రాలు, బిల్లులు లేవని గమనించి, రూ.4,63,578 విలువైన సరకులను నిలిపివేశారు. ఆ కార్యాలయాలపై తదుపరి చర్యలకు వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌కు అప్పగిస్తూ నివేదిక రూపొందించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారి కె.కుమార్ ఆదేశాలతో జరిగిన ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాల నాయుడు, సీఐలు రమేష్, శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కార్తిక మాసం, శివరాత్రి ఏర్పాట్లకు టెండర్లు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం నెల రోజులు, మహాశివరాత్రి ఆరు రోజుల పాటు వివిధ అలంకరణల ఏర్పాట్లకు టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పుష్పాలంకరణ, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ, క్యూలైన్లు, బారికేడ్లు, సెక్యూరిటీ గార్డుల సరఫరా, రథోత్సవం, మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారి కల్యాణం, బ్యాండ్ వంటి కార్యక్రమాలకు వచ్చే నెల ఐదో తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా కార్యాలయం బాక్స్‌లో సీల్డ్ టెండర్లు వేయాలని సూచించారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు టెండర్ బాక్సులు తెరుస్తామన్నారు. ప్రతి పనికి రూ.వెయ్యి ధరావతు, షెడ్యూల్‌కు రూ.100 చెల్లించాలని తెలిపారు.

తాను కనుమరుగై.. కొందరికి వెలుగై..

ప్రమాద మృతుడి అవయవాలు దానం



అవయవ దాత శ్రీరాములుతో వైద్యులు

కాకినాడ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి, మృతి చెందిన కాట్రేనికోన మండలం చెయ్యేరు జట్లగుంట గ్రామానికి చెందిన గవర శ్రీరాములు (రాంబాబు – 58) అవయవాలను కుటుంబ సభ్యులు శుక్రవారం దానం చేశారు. ఈ నెల 26న బైక్‌పై వెళుతున్న శ్రీరాములును ముమ్మిడివరం మండలం బొండాయికోడు పెట్రోల్ బంకు ఎదుట రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిపోయిన శ్రీరాములు అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో శుక్రవారం కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద ఉన్న ట్రస్ట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. శ్రీరాములు కిడ్నీల్లో ఒకదానిని ఇక్కడి ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ బృందం వైద్యుడు తీసి ఆసుపత్రిలోని ఒక రోగికి అమర్చారు. మరో కిడ్నీని విశాఖపట్నం కేర్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కళ్లను ఐ బ్యాంక్‌కు అందజేశారు. అవయవ దానానికి ముందుకు వచ్చిన శ్రీరాములు కుమారుడు మాళశంకర్‌ను ట్రస్ట్ ఆసుపత్రి యాజమాన్యం తరఫున డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రామకృష్ణ అభినందించారు.